సాక్షి
ప్రకాశం
7
ఆదివారం । 12 । మే । 2024

# ఒంగోలు పార్లమెంట్ బ్యాలెట్ నమూనా

Ready

Ballot Unit

| వరుస సంఖ్య | అభ్యర్థి పేరు | అభ్యర్థి ఫోటో | గుర్తు | ఓటు |
|---|---|---|---|---|
| 1 | | | | |
| 2 | డా॥ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి |  |  |  |
| 3 | | | | |
| 4 | | | | |
| 5 | | | | |
| 6 | | | | |
| 7 | | | | |
| 8 | | | | |
| 9 | | | | |
| 10 | | | | |
| 11 | | | | |
| 12 | | | | |

**“సీలింగ్ ఫ్యాన్”** గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి, వేయించి నన్ను పార్లమెంటు అభ్యర్థిగా గెలిపించ ప్రార్థన...

## మన ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి డా॥ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ

## క్లుప్తంగా

### మల్లవరం వెంకటేశ్వర స్వామి ఆలయంలో చోరీ

- సుమారు రూ.లక్ష అపహరణకు గురై ఉంటుందని అంచనా



హుండీపై వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్ సభ్యుడు

**మద్దిపాడు:** జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మల్లవరం వెంకటేశ్వరస్వామి ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన హుండీని దొంగలు పగులగొట్టి సొత్తును అపహరించారు. శుక్రవారం రాత్రి ఆలయ తలుపులు మూసివేసి పూజారులు వెళ్లిపోయిన తర్వాత అర్ధరాత్రి సమయంలో దేవాలయం ముఖ మండపం తాళాలు పగులగొట్టిన దుండగులు లోపలికి ప్రవేశించి హుండీని పగులగొట్టి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఆలయ అర్చకులు శనివారం ఉదయం ఆలయ ద్వారాలు తెరిచి లోనికి వెళ్లగా హుండీ తలుపు పగులగొట్టి ఉండటం గమనించి వెంటనే ఈఓ దామా నాగేశ్వరరావుకు, ఆలయ కమిటీ చైర్మన్ నాగిరెడ్డికి సమాచారం అందించారు. ఆ మేరకు మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో ఈఓ ఫిర్యాదు చేశారు. మద్దిపాడు పోలీసులు క్లూస్ టీమ్‌ను పిలిపించి వేలిముద్రలు సేకరించి విచారణ చేపట్టారు. అపహరణకు గురైన సొత్తు రూ.లక్ష వరకూ ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై వెంకటేశ్వరరావు

**జరుగుమల్లి (సింగరాయకొండ):** రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన జాతీయ రహదారిపై జరుగుమల్లి మండల పరిధిలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో దాబా వద్ద శనివారం తెల్లవారుజామున జరిగింది. నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం భీమవరం గ్రామానికి చెందిన మొద్దు రితీష్‌కుమార్ (21) తన సొంత పనిమీద స్నేహితులు అశ్విన్, మహేష్‌తో కలిసి స్కూటీపై జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో దాబా వద్దకు రాగానే స్కూటీ అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లో ఉన్న ఫెన్సింగ్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో రితీష్‌కుమార్ తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మరణించగా, అశ్విన్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించామని ఎస్సై వెంకటేశ్వరరావు వివరించారు.

# వడ్డెర్లకు అండగా వైఎస్ జగన్

- ఆయనను గెలిపించుకుంటేనే వడ్డెర్ల అభ్యున్నతి
- ఇప్పటికే గత ఐదేళ్లలో రూ.4,500 కోట్లు ఖర్చుపెట్టారు
- ఒక ఎమ్మెల్యే, ఒక ఎమ్మెల్సీతో పాటు అనేక నామినేటెడ్ పదవులు కేటాయింపు
- చంద్రబాబు మోసపూరిత మాటలు నమ్మొద్దు
- వడ్డెర సంఘ జాతీయ అధ్యక్షుడు, శ్రీశైలం ట్రస్టు బోర్డు సభ్యుడు తన్నీరు ధర్మరాజు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు తన్నీరు ధర్మరాజు

**ఒంగోలు:** స్వాతంత్య్రం వచ్చిన తర్వాత వడ్డెర్ల సంక్షేమం ఏదైనా జరిగిందంటే అది నాడు వైఎస్సార్, నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మాత్రమే అని వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు, శ్రీశైలం ట్రస్టు బోర్డు సభ్యుడు తన్నీరు ధర్మరాజు తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2004లో వడ్డెర ఫెడరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు క్వారీలకు సంబంధించి మైనింగ్ జోన్లలో 10 శాతం వడ్డెర్లకు రిజర్వు చేశారన్నారు. అంతేగాకుండా హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ పదవిని కూడా వడ్డెర్లకు కేటాయించడం వల్లే వడ్డెర్ల రాజకీయ ప్రస్థానం వేగవంతమైందన్నారు. వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానించి పార్లమెంట్‌కు పంపిన నేత వైఎస్సార్ అన్నారు. ఆయన మరణానంతరం వడ్డెర్ల సంక్షేమం కుంటుపడిందన్నారు. కానీ, నేడు ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక ఎమ్మెల్యే, ఒక ఎమ్మెల్సీతో పాటు నాలుగు మున్సిపాల్టీలకు చైర్మన్లుగా, ఏడుగురిని వివిధ కార్పొరేషన్లలో డైరెక్టర్లుగా, వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు 12 మందికి పదవులు కేటాయించారని తెలిపారు. స్థానిక సంస్థలలో 30 మందికి జెడ్పీ వైస్ చైర్మన్లు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీలు ఇలా అనేక మందికి రాజకీయ ప్రాధాన్యత కల్పించారన్నారు. కానీ, కావలిలో వడ్డెర సామాజిక వర్గానికి చెందిన పసుపులేటి సుధాకర్‌కు టీడీపీలో టికెట్ ఇస్తానని చెప్పి ఇవ్వకుండా కావ్యకృష్ణారెడ్డికి చంద్రబాబు ఇచ్చారన్నారు. అనంతరం సుధాకర్‌కు నరసరావుపేట, పుట్టపర్తి, హిందూపూర్‌లో టికెట్ ఇస్తానని ఇవ్వకుండా మోసగించారన్నారు. నేడు వలంటీర్లకు పదివేలు ఇస్తానంటూ మభ్యపెట్టడం కూడా ఇటువంటిదే అన్నారు. జగనన్న ఆశయాలే లక్ష్యంగా పేద ప్రజల సంక్షేమం కోసం పాటుపడే వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎమ్మెల్యే అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డిని, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర రెడ్డిని గెలిపించేందుకు వడ్డెరలంతా వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు.

కందుకూరు మున్సిపాలిటీ మాజీ చైర్మన్ బూర్సు మాలకొండయ్య మాట్లాడుతూ పాతాళం లోతులో కూరుకుపోయి విలవిల్లాడుతున్న తమ జాతిని పైకి తీసుకువచ్చిన ఘనత వైఎస్సార్‌దేనని అన్నారు. అందులో భాగంగానే తనకు మున్సిపల్ చైర్మన్ పదవి లభించిందన్నారు. సీఎంగా ఉండి కూడా ఒక వడ్డెర జాతి నాయకుని కుమార్తె వివాహానికి హాజరై దీవించిన వ్యక్తి, వడ్డెరలంటే అమిత ప్రేమ ఉన్న వైఎస్సార్ కుటుంబం గెలుపు కోసం ప్రతిఒక్కరూ సిద్ధంగా ఉన్నారన్నారు. వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, వైఎస్సార్ సీపీ బీసీ సంఘం నగర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ అశోక్ మాట్లాడుతూ వడ్డెరలకు కోటి రూపాయలు విలువచేసే ఆరామక్షేత్రం స్థలాన్ని బాలినేని శ్రీనివాసరెడ్డి ఒంగోలు నగరంలో కేటాయించారన్నారు. 1216 మంది వడ్డెరలకు ఇళ్లపట్టాలు మంజూరయ్యాయని, ఒంగోలు పార్లమెంట్లో 1.54 లక్షల ఓట్లు తమ సామాజికవర్గం వారివి ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే 11.05 లక్షలమంది వడ్డెరలకు రాష్ట్రవ్యాప్తంగా గత ఐదు సంవత్సరాలలో రూ.4,365 కోట్లు కేటాయించారని తెలిపారు. అందుకు కృతజ్ఞతగా జిల్లాలోని ఒంగోలు పార్లమెంట్, అన్ని అసెంబ్లీ సీట్లలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని వడ్డెర్లకు పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ పల్లపు రాముడు, విమల, వడ్డెర సంఘం నాయకులు మురళి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



కోటపాడులో ప్రచారం చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

# కొండపిని అభివృద్ధి చేస్తా

- జగనన్న జెండా, అజెండాతోనే రాష్ట్ర ప్రజల అభ్యున్నతి
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఆదిమూలపు సురేష్
- చివరిరోజు కోటపాడు, బాలిరెడ్డిపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

**పొన్నలూరు:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులతో కొండపి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, ఆదరించి గెలిపిస్తే కొండపి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజైన శనివారం పొన్నలూరు మండలంలోని కోటపాడు, బాలిరెడ్డిపాలెం, కల్లూరివారిపాలెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ప్రతి గ్రామంలో స్థానిక ప్రజలు మంత్రి సురేష్‌కు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ చంద్రబాబు ఐదేళ్ల పాలనలో పేదవాడి సంక్షేమం శూన్యమన్నారు. 2014 ఎన్నికల సమయంలో వందలకొద్దీ హామీలు గుప్పించి సీఎం అయ్యాక వాటిని సక్రమంగా అమలు చేయలేదన్నారు. ప్రస్తుతం జగనన్న నవరత్నాలను కాపీకొడుతూ వాటినే తమ హామీలుగా చెబుతున్నారన్నారు. ఎన్నికల ముందు ఒకలా.. ముగిసిన తర్వాత మరోలా ప్రవర్తించే ఏకైక వ్యక్తి చంద్రబాబు అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమానికి పెద్దపీట వేశారని గుర్తు చేశారు.

వైఎస్సార్ సంక్షేమ పాలన కోసం జగనన్నకు మరో అవకాశం ఇవ్వాలన్నారు. కొండపి నియోజకవర్గ ప్రజలతో మూడు సార్లు ఓట్లు వేయించుకుని రెండు సార్లు గెలిచిన ఎమ్మెల్యే స్వామి ఈ ప్రాంత అభివృద్ధికి ఏమీ చేయకపోగా తన స్థాయి మరిచి అవాకులు చవాకులు పేలుతున్నాడని మంత్రి సురేష్ విమర్శించారు. టీడీపీ నాయకులు ఎన్ని కుట్రలు పన్నినా, అవినీతి డబ్బు పంచినా కొండపిలో వైఎస్సార్ సీపీ గెలుపును ఆపలేరన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, సర్పంచ్ అన్నెం కొండారెడ్డి, నారపురెడ్డి మహేష్, అల్లూరిరెడ్డి, కల్లూరి వెంకటేశ్వర రెడ్డి, బాలు ఈశ్వర్‌రెడ్డి, నాగిరెడ్డి సుబ్బారెడ్డి, కప్పల దానియేలు, పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీలోనే బీసీలకు మేలు

- బీసీ సమైక్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు, సినీనటుడు మస్తాన్‌రావు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ధన్నారాపు మస్తాన్‌రావు, తదితరులు

**ఒంగోలు:** వైఎస్సార్ సీపీలోనే బీసీలకు మేలు జరుగుతుందని, ప్రతి ఒక్క బీసీ తమ సంక్షేమాన్ని కాంక్షిస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు ముందుకు రావాలని బీసీ సమైక్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు, సినీనటుడు ధన్నారపు మస్తాన్‌రావు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని గోపాలనగర్, ఇందుర్తి నగర్, గొడుగుపాలెం, విజయనగర్ కాలనీ, గిలకల బావి సెంటర్లలో రజక సంఘం తరఫున రజక సామాజికవర్గాల ఇళ్లకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా పేదల జీవితాల్లో సీఎం జగన్ వెలుగులు నింపారన్నారు. చంద్రబాబు హయాంలో పేదలు చదువుకునే 45 వేల పాఠశాలలు మూసివేశారన్నారు. నేడు ప్రభుత్వ పాఠశాలలను మోడ్రన్ స్కూళ్లగా తీర్చిదిద్ది పేదలకు అందని ద్రాక్షగా ఉన్న ఆంగ్లమాధ్యమాన్ని సైతం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. అమ్మ ఒడి, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, అన్ని వర్గాలకు పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదల్లో ఆత్మస్థైర్యాన్ని జగన్ నింపారన్నారు. ఈ ఎన్నికల్లో బీసీలకు అత్యధికంగా ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు కేటాయించారని తెలిపారు. టీడీపీ హయాంలో ఒక్కరికి కూడా రాజ్యసభ సీటు కేటాయించలేదని గుర్తుచేశారు. కానీ, నేడు జగన్ ఐదుగురికి అవకాశం కల్పించారని, మంత్రి పదవుల్లో సైతం 65 శాతం బీసీలకు కేటాయించారని వివరించారు. బీసీల పక్షపాతి పార్టీ అయిన వైఎస్సార్ సీపీని గెలిపించుకునేందుకు బీసీలంతా ముందుకు రావాలన్నారు. ఆ పార్టీ ఒంగోలు ఎమ్మెల్యే అభ్యర్థి బాలినేని శ్రీనివాస రెడ్డి, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డిలకు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా రజక అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు గుర్రం సుబ్బన్న, ఒగ్గులగుంట పరిరక్షణ సమితి గౌరవ అధ్యక్షుడు మార్టూరి వెంకటేశ్వర్లు, పాదర్తి వెంకటేశ్వర్లు, దేవవరంపాటి శ్రీదేవి, మార్టూరి రామకృష్ణ, మార్టూరు హరికృష్ణ, రజక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రెండు చోట్ల మద్యం బాటిళ్ల పట్టివేత

**మద్దిపాడు:** మద్దిపాడులో అక్రమంగా మద్యం నిల్వ చేశారంటూ పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు శుక్రవారం సమాచారం అందడంతో వారు ఎఫ్ఎస్‌టీ 3వ టీమ్‌కు సమాచారం అందించారు. ఆ టీమ్‌లోని ఈఓ మోహన్ సిబ్బందితో కలిసి మద్దిపాడు బొడ్డురాయి సమీపంలో ఉన్న సుద్దపల్లి గంగయ్య ఇంటిపై దాడి చేసి మహారాష్ట్రకు చెందిన బ్లెండర్ ప్రైడ్ 750 ఎంఎల్ 16 మద్యం సీసాలు పట్టుకున్నారు. వాటిని సీజ్ చేసి ఇంటి యజమానిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రాత్రి 11 గంటల సమయంలో ఫిర్యాదు చేశారు. మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరో సంఘటనకు సంబంధించి శనివారం ఉదయం 11 గంటల సమయంలో మారెళ్లకుంటపాలేనికి చెందిన చెన్నుపాటి వెంకట శేషయ్య గోతాంలో 29 క్వార్టర్ బాటిళ్లు తీసుకెళుతుండగా సమాచారం అందుకున్న ఎస్ఐ వి.మహేష్ ఆధ్వర్యంలో ఐడీ పార్టీ కానిస్టేబుల్ సురేష్ కొత్తపల్లి గ్రామ పరిసరాలలో పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.




కొత్తపల్లి పరిసరాల్లో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై మహేష్

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు మృతి



మృతి చెందిన బ్రహ్మనాయుడు, గోపీ

**మార్కాపురం రూరల్:** రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. ఈ సంఘటన మండలంలోని కొట్టాలపల్లి వద్ద సోమవారం సాయంత్రం జరిగింది. మండలంలోని నికరంపల్లి గ్రామానికి చెందిన మీనగ బ్రహ్మనాయుడు(17), మీనిగ గోపీ (18) ఇటీవల ఇంటర్ పూర్తి చేశారు. ప్రస్తుతం సెలవులు కావడంతో ఒకరు వ్యవసాయ పనులకు, మరొకరు దుకాణంలో పనిచేసేందుకు వెళుతున్నారు. ఈ క్రమంలో శనివారం కొట్టాలపల్లి గ్రామం నుంచి మార్కాపురం వెళ్తున్న ఆటో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలాన్ని మార్కాపురం రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు.

# దర్శిలో కడియాల గ్యాంగ్


- ఎన్నికల్లో గొడవలకు చిల్లరమూకను దింపిన కడియాల రమేష్
- వాహనాలకు సైలెన్సర్‌లు తీసి పెద్ద పెద్ద శబ్దాలతో హంగామా
- భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు
- కీలుబొమ్మగా లక్ష్మి
- పెత్తనమంతా కడియాల కుటుంబానిదే

**దర్శి:** ప్రశాంత రాజకీయాలకు దర్శి పెట్టింది పేరు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి ఇక్కడ ప్రచారం ప్రశాంతంగా సాగుతోంది. అయితే ఎన్నికల రోజు ఎలాగైనా గొడవలు సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేందుకు టీడీపీ అభ్యర్థి లక్ష్మి బంధువులు దర్శికి పెద్ద సంఖ్యలో చిల్ల రౌడీలు దించారు. ప్రస్తుతం దర్శిలో నరసరావుపేటకు చెందిన చిల్ల రౌడీలు హల్‌చల్ చేస్తున్నారు. వాహనాల సైలెన్సర్‌లు తీసి వేసి పెద్ద పెద్ద శబ్దాలతో హంగామా సృష్టిస్తున్నారు. దర్శిలో ఏ లాడ్జిలో చూసినా నరసరావుపేటకు చెందిన చిల్లర రౌడీలే కనిపిస్తారు. వీరందరినీ ఎన్నికల్లో గొడవలు సృష్టించాలనే ఇక్కడికి రప్పించినట్లు తెలుస్తోంది. ఈ తతంగం అంతా కడియాల లలిత్ సాగర్ బాబాయి కడియాల రమేష్ చేస్తున్నారని తెలుస్తోంది. కడియాల రమేష్‌పై నరసరావుపేటలో అనేక కేసులు ఉన్నాయి. కోడెల శివప్రసాద్‌రావు అండదండలతో భూములు ఆక్రమించడం, చిల్లర దుకాణాలలో మామూళ్లు వసూలు చేయడం, ఇవ్వని వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేయడం వంటి పనులు టీడీపీ హయాంలో కొనసాగించారు.

**ఆ ఆస్పత్రిపై ఎన్నో ఆరోపణలు..**

నరసరావుపేటలోని కడియాల ఆసుపత్రి ఇక్కడి అభ్యర్థి సాగర్ తండ్రి కడియాల వెంకటేశ్వరరావుదే. ఆ ఆసుపత్రిలోనే ఈ కుటుంబం వైద్యం చేస్తుంటారు. అయితే ఆ ఆస్పత్రిపై ఎన్నో ఆరోపణలు ఉన్నాయి. టీడీపీ హయాంలో అధికారాన్ని అడ్డు పెట్టుకొని ప్రభుత్వాసుపత్రికి వచ్చిన రోగులను ఆరోగ్యశ్రీ పేరుతో వారి ఆస్పత్రికి తీసుకెళ్లి దోపిడీ చేసేవారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కోడెల శివప్రసాద్‌రావు అండదండలతో ప్రభుత్వ వైద్యులను బెదిరించి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న పేద రోగులకు వైద్యం చేయనీయకుండా చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు వచ్చి తీసుకెళ్లే 108 వాహనాలు కూడా తమ ఆసుపత్రికే రావాలని హుకుం జారీ చేసి వారికి ప్రభుత్వ వైద్యం అందకుండా వారి ఆసుపత్రిలో ప్రమాద బాధితులను దోపిడీ చేశారు. టీడీపీ వత్తిళ్లకు తట్టుకోలేని వైద్యులు చేసేదేమిలేక చిన్న చిన్న వైద్యాలు చేసి వారి ఆసుపత్రికి రోగులను పంపేవారు. ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యంతో పాటు ఇతర వైద్యం పేరుతో పేదల వద్ద అధిక మొత్తంలో వసూలు చేసినట్లు ఆరోపణలు ఎన్న ఉన్నాయి. ఆ విధంగా కోట్లాది రూపాయల సొమ్ము దోపిడీ చేసి వందలాది ఎకరాల భూములు, బినామీ పేర్లతో పెద్ద పెద్ద ఆసుపత్రులు కట్టించారు. ఇటీవల లక్ష్మీతో 100పడకల ఆసుపత్రిని దర్శిలో ఏర్పాటు చేస్తామని ఎన్నికల ప్రచారంలో హామీలు ఇప్పిస్తున్నారు. నరసరావు పేటలో అమలు చేసిన దోపిడీ ఇక్కడ కూడా చేయాలనేది వారి ప్లాన్. ఆసుపత్రిని మంచి వ్యాపారంగా మలుచుకోవాలనే దురుద్దేశంతోనే వారు దర్శి రాజకీయాల్లోకి అడుగు పెట్టారనేది వారి వ్యవహార శైలి స్పష్టం చేస్తుంది. టీడీపీ అభ్యర్థి లక్ష్మి కీలుబొమ్మే. కడియాల కుటుంబానిదే పెత్తనమంతా..ఇక్కడ పెత్తనం చేసేది కూడా అభ్యర్థి లక్ష్మీ మామ కడియాల వెంకటేశ్వరరావు, చిన్న మామ కడియాల రమేష్, భర్త లలిత్‌సాగర్‌లే.

## నియోజకవర్గాలకు అదనపు కంట్రోల్ యూనిట్లు



యూనిట్లను పంపుతున్న దృశ్యం

**ఒంగోలు అర్బన్:** పోలింగ్‌లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలకు అదనంగా రిజర్వులో ఉండేలా కంట్రోల్ యూనిట్లను జిల్లా రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పంపించారు. జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు 70 కంట్రోల్ యూనిట్లు, ఒంగోలు పార్లమెంట్ నియోజవకార్గనికి 74 కంట్రోల్ యూనిట్లను స్థానిక మామిడిపాలెం ఈవీఎం గోదాము నుంచి తరలించారు. కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వైఎస్ఆర్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు రసూల్, కాలేషాబేగ్, రాజశేఖర్, ఉపేంద్ర, రంగారవు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### చంద్రబాబు రోడ్ షోలో జీఆర్‌పీ సీఐ శ్రీకాంత్



చంద్రబాబు రోడ్ షోలో పాల్గొన్న ఒంగోలు జీఆర్‌పీ సీఐ శ్రీకాంత్

**ఒంగోలు సబర్బన్:** ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు ఒంగోలులో శుక్రవారం నిర్వహించిన రోడ్డుషోలో ఒంగోలు గవర్నమెంట్ రైల్వే పోలీస్(జీఆర్‌పీ) స్టేషన్ సీఐ నిడమనూరి శ్రీకాంత్ పాల్గొన్నారు. చంద్రబాబు శుక్రవారం నెల్లూరు బస్టాండ్ సెంటర్ నుంచి రోడ్ షో నిర్వహించారు. అక్కడ నుంచి రోడ్ షోలో పాల్గొనడంతో పాటు మిరియాలపాలెం సెంటర్‌లో చంద్రబాబు నిర్వహించిన సభ వద్ద చంద్రబాబు ప్రసంగం ఆసాంతం అక్కడే ఉండిపోయారు. ఎన్నికల నియమ నిబంధనావళి ఉన్నా చంద్రబాబు రోడ్ షోలో, సభలో పాల్గొనటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. సీఐ శ్రీకాంత్ జీఆర్‌పీ సీఐగా వెళ్లక ముందు జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్‌లో సీఐగా పనిచేశారు. సీఐ శ్రీకాంత్ చంద్రబాబు రోడ్ షోలో పాల్గొన్న అంశాన్ని ఒంగోలు డీఎస్పీ కిషోర్ బాబును వివరణ కోరితే, ఆయనకు చంద్రబాబు కార్యక్రమానికి ఎలాంటి విధులు కేటాయించలేదన్నారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఒంగోలు డీఎస్పీ వెల్లడించారు.


### పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన ఎస్పీ


చందలూరులో పోలింగ్ కేంద్రాలు పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

**వేటపాలెం/జే.పంగులూరు:** సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు, ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహణే లక్ష్యంగా పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. మండల పరిధిలోని చందలూరు గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో ఐదుగురుకి మించి గుంపులు, గుంపులుగా తిరగరాదని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల పరిశీలనలో రేణింగవరం ఎస్సై కేకే తిరుపతిరావు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

› వేటపాలెం మండలంలోని పందిళ్లపల్లిలో ఎంపీపీ, జెడ్పీహెచ్ హైస్కూల్‌ల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎస్పీ శనివారం పరిశీలించారు. పోలింగ్ రోజున ఎన్‌సీసీ, మాజీ ఆర్మీ వ్యక్తుల సేవలను పోలింగ్ కేంద్రాల వద్ద ఉపయోగి స్తున్నామని తెలిపారు. మద్యం, నగదు, ఇతర ఆకర్షకాలను పంపిణీ చేస్తుంటే సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో చీరాల డీఎస్పీ బీ ప్రసాద్ పాల్గొన్నారు.

### శింగరకొండ దర్శిని


**అద్దంకి:** క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, వైశాఖ మాసం, ఆరుద్ర నక్షత్రం, చవితి తిథి, సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు.

# సమష్టిగా కొండపిని గెలుద్దాం

- కార్యకర్త చేయిపట్టుకుని నడిచే వాడిని తప్ప విడిచి పెట్టను
- కొండపి అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టో
- ప్రత్యేక మేనిఫెస్టోను ఆవిష్కరించిన చెవిరెడ్డి, మంత్రి సురేష్
- తమ ప్రసంగాలతో కార్యకర్తలతో జోష్ నింపిన అభ్యర్థులు


బుల్లెట్‌పై మంత్రి సురేష్ సందడి


చెవిరెడ్డి, మంత్రి సురేష్‌ను భారీ గజమాలతో సత్కరించిన డాక్టర్ కార్తీక్

**సింగరాయకొండ(మర్రిపూడి):** అందరం సమష్టిగా ముందుకు సాగి కొండపిపై వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేద్దామని పార్టీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. సింగరాయకొండ మండల కేంద్రంలో శనివారం సాయంత్రం పాకల రోడ్డు నుంచి కందుకూరు రోడ్డు సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి తన ప్రసంగంతో కార్యకర్తలు, అభిమానుల్లో జోష్ నింపారు. అనంతరం ఏర్పాటు చేసిన ముగింపు సభలో మంత్రి, కొండపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సురేష్‌తో కలిసి పాల్గొని మాట్లాడుతూ కార్యకర్త చేయి పట్టుకుని నడిపించడం తప్ప వదిలి పెట్టే మనస్తత్వం కాదన్నారు. నియోజకవర్గానికి అభివృద్ధి రుచి చూపిస్తానని, నేను ఎప్పటికీ కార్యకర్తనే తప్ప నాయకుడిని కాదని చెప్పారు.

నేను నాన్ లోకల్ కాదు లోకల్ అని స్పష్టం చేశారు. వైఎస్ కుటుంబంతో 36 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి తాత రాజారెడ్డి, తండ్రి రాజశేఖర్‌రెడ్డి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో సన్నిహిత సంబంధాలు కొనసాగించానని చెప్పారు.

మంత్రి సురేష్, నేను ఇద్దరం మంచిస్నేహితులం, జగనన్న సన్నిహితులం అని పేర్కొన్నారు. సింగరాయకొండ వైఎస్సార్‌సీపీకి అడ్డా, ఒంగోలు పార్లమెంట్ పరిధిలో ఉన్న మండలాల కంటే ఈ మండలంలో అత్యధిక మెజారిటీ రావాలని కోరారు. పార్టీకి కష్టపడుతూ, కాపాడే వారిని గుర్తు పెట్టుకుంటానని భరోసా ఇచ్చారు.

**చంద్రబాబునే ఓడించా..**

చంద్రగిరిలో 43 వేల ఓట్ల అత్యధిక మెజారిటీతో గెలిచానని గుర్తు చేశారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా అనుభవం ఉన్న చంద్రబాబు సొంత గ్రామం నారావారిపల్లె చంద్రగిరిలో ఉందన్నారు. తాను జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకం ఉంటే గెలిపించాలని ప్రజలను కోరానని, కానీ చంద్రబాబు తన పార్టీని గెలిపించాలని ప్రజలను ప్రాథేయపడినా ప్రజలు ఓడించారన్నారు. నియోజకవర్గ అభివృద్ధేకాదు కార్యకర్తల సంక్షేమం కోసం కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కొండపిలో ఎందుకు ఓడిపోతున్నామని జగనన్న అంటే.. మనం ఓడిపోలేదు, టీడీపీ గెలుస్తుందని చెప్పాననన్నారు. పార్టీలోని విభేదాలతోనే మనం ఓడిపోతున్నామని, కొండపి గడ్డపై అత్యధిక మెజార్టీతో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి జగనన్నకు కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు.

**కొండపికి ప్రత్యేక మేనిఫెస్టో..**

కొండపి అభివృద్ధికి జగనన్న ప్రకటించిన పథకాలతో పాటు తన సొంత మేనిఫెస్టోను మంత్రి సురేష్ ప్రకటించారు. కొండపికి అభివృద్ధిని పరిచయం చేస్తానని, అభివృద్ధి చేసి చూపిస్తానని, అభివృద్ధి దిశగా ముందుకుపోతానని వివరించారు. తాను తయారుచేసిన ప్రత్యేక మేనిఫెస్టో ప్రకారం మర్రిపూడి, పొన్నలూరు మండలాలకు సాగు, తాగునీటి సమస్యను పరిష్కరించే సంగమేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేస్తానని, ఎస్సీ కాలనీల్లో శ్మశాన వాటికలు నిర్మిస్తానని, సింగరాయకొండ, మర్రిపూడి మండలాల్లో అసైన్‌మెంట్ భూముల క్రమబద్ధీకరణతో పాటు, భైరాగిమాన్యం భూముల రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కరిస్తానని, జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేయిస్తానని, సింగరాయకొండను మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తానని, పొగాకు, సుబాబుల్ రైతులకు మద్దతు ధర కల్పిస్తానని, మండలంలో హిందువులకు ప్రత్యేక శ్మశానవాటిక స్థలం కేటాయిస్తానని, పాలేరు, మన్నేరుపై చెక్ డ్యాంలు నిర్మిస్తానని వివరించారు. అలాగే చెవిరెడ్డి సహకారంతో నడికుడి-కాళహస్తి రైల్వే పనులు త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. తీరప్రాంత మత్స్యకారుల భద్రతకు స్పీడ్ బోట్ ఏర్పాటు చేస్తానని, మండల కేంద్రంలో పార్కులు ఏర్పాటు చేస్తానని, మెయిన్‌రోడ్డును ఆధునీకరిస్తానని, దేవాదాయభూముల రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఒక్క అవకాశం ఇచ్చి ఆశీర్వదించండి అని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని మంత్రి సురేష్, చెవిరెడ్డి భాస్కరరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అంతకుముందు పాకల రోడ్డు నుంచి కందుకూరు రోడ్డు సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మంత్రి సురేష్ బుల్లెట్ నడిపి కార్యకర్తలలో జోష్ నింపారు. కందుకూరు రోడ్డు సెంటర్‌లో పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ యన్నాబత్తిన కార్తీక్ భారీ గజమాలతో చెవిరెడ్డి, మంత్రి సురేష్‌లను సత్కరించారు. పార్టీ మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి యన్నాబత్తిన చిన్నా, శ్రీశైలం దేవస్థానం బోర్డు మెంబర్ తన్నీరు ధర్మరాజు, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ యనమల మాధవి, చుక్కా కిరణ్‌కుమార్, కనుమళ్ల సొసైటీ చైర్మన్ మలినేని వెంకటేశ్వర్లు, రాపూరి ప్రభావతి, పి.పోలమ్మ, సోమిశెట్టి సురేష్, గాదంశెట్టి విజయ్, షేక్ సలీంబాషా, షేక్ కరీం, షేక నియాజ్, సయ్యద్ ఆబిద్‌ఆలీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

# జగనన్న సాక్షిగా అండగా ఉంటా

- సంతనూతలపాడు నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టమొచ్చినా ఆదుకుంటా
- వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించండి
- ఎన్నికల ప్రచారంలో మంత్రి మేరుగు నాగార్జున


భారీగా పాల్గొన్న ప్రజలు

**నాగులుప్పలపాడు:** జనం మెచ్చిన నేత సీఎం జగనన్న సాక్షిగా సంతనూతలపాడు నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని, ఏ కష్టమొచ్చినా ఆదుకుంటానని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి మేరుగు నాగార్జున హామీ ఇచ్చారు. సంతనూతలపాడు నియోజకవర్గ ప్రజలంతా వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. నాగులుప్పలపాడు మండలంలోని బీ నిడమానూరు గ్రామంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి కుటుంబం అన్నివిధాలుగా మెరుగ్గా జీవించాలని, ఆర్థికంగా అందరూ బాగుపడాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లుగా అనేక సంక్షేమ పథకాలు అమలుచేశారని వివరించారు. పేదలకు అండగా ఉండటమే లక్ష్యంగా ముందుకు సాగారన్నారు. అలాంటి వ్యక్తిని మళ్లీ సీఎం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రజలనే నమ్ముకుని ఒంటరిగా అందరి తరఫున యుద్ధం చేస్తున్న జగనన్నకు మనం సైనికులుగా నిలబడి విపక్షాల కుట్రలను తిప్పికొట్టాలన్నారు. అధికారంలోకి వచ్చేందుకు చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించి వైఎస్సార్ సీపీకి ఓటేయించడం ద్వారా టీడీపీ కూటమిని గుణపాఠం చెప్పాలని కోరారు. ముందుగా మంత్రి మేరుగు నాగార్జునకు మహిళలు హారతులు పట్టి పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి మేరుగు పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని ఆలయాల్లో పూజలు చేశారు. కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, నాయకులు దాకా కృష్ణారెడ్డి, పులిచర్ల పరంధామిరెడ్డి, సర్పంచ్ వడ్డిముక్కల శ్రీను, గంధ్ర రమణారెడ్డి, వైస్ ఎంపీపీ మల్లెల జాన్సన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

- ఈనెల 13న జరిగే పోలింగ్‌కు సర్వం సిద్ధం చేశాం
- జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

**ఒంగోలు అర్బన్:** ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు సద్వినియోగం చేసుకోవడంతో పాటు ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా నిష్పక్షపాతంగా ఓటు వేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ కోరారు. శనివారం జిల్లా కమాండ్ కంట్రోలు కేంద్రంలో జిల్లా ఎస్పీ గరుడ్‌సుమిత్ సునీల్‌తో కలిసి ఈ నెల 13వ తేదీ జరిగే పోలింగ్ ప్రక్రియ ఏర్పాట్లపై విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో ఈ నెల 13న జరిగే పోలింగ్ ప్రక్రియకు సంబంధించి అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పోలింగ్ శాతం పెంచేందుకు వీలుగా తగిన చర్యలు తీసుకున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వేసవి దృష్ట్యా ఇబ్బందులు రాకుండా అవసరమైన అన్నీ మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. దివ్యాంగులు, వృద్ధులకు అవసరమైన వీల్ చైర్‌లు అందుబాటులో ఉంచామని చెప్పారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్ తేదీకి 48 గంటల ముందు నుంచే ప్రచారం ఆపేయాలన్నారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్‌లో ఎవరూ ప్రచారం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. 12, 13 తేదీల్లో మద్యం అమ్మకాలు నిలిపి వేశామన్నారు. పత్రికల్లో రాజకీయ పార్టీల ప్రకటనల ప్రచురణకు 48 గంటల ముందు ఎంసీఎంసీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. బయటి జిల్లాలు, నియోజకవర్గాల నుంచి వచ్చిన వ్యక్తులంతా వారి నియోజకవర్గాలకు వెళ్లాలన్నారు.

ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శనివారంతో ఎన్నికల ప్రచారం ముగుస్తుందని అప్పటి నుంచి ఆయా నియోజకర్గాల్లో ఇతర నియోజకవర్గాల వారు ఉండకూడదన్నారు. శనివారం సాయంత్రం నుంచి లాడ్జిలు, హాస్టళ్లు వంటివి తనిఖీలు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు ఎంసీసీ వైలేషన్ కింద 190 కేసులు నమోదు చేశామన్నారు. మొత్తం రూ.5 కోట్ల విలవైన నగదు, వస్తువులను సీజ్ చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రశాతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా నడుచుకోవాలన్నారు.

# వైఎస్సార్ సీపీ శ్రేణుల భారీ బైక్ ర్యాలీ


ప్రచారంలో అన్నా రాంబాబు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జంకె


ప్రచారంలో అన్నా రాంబాబు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జంకె

- కార్యకర్తల కష్టం తెలిసిన వ్యక్తిని: చెవిరెడ్డి
- మరింత మంచి పాలన కోసం మద్దతు ఇవ్వండి: అన్నా

### భుజం మారుస్తామే తప్ప..పార్టీ మార్చం: చెవిరెడ్డి

పార్టీ జెండాను మోసే క్రమంలో భుజం నొప్పి అనిపిస్తే భుజం మారుస్తామే తప్ప పార్టీ మార్చే వ్యవహారం ఉండదని ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. కార్యకర్తల కష్టం తెలిసిన వాడిని, జెండాను దించకుండా భుజాన మోస్తూనే ఉంటామని చెప్పారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అందుబాటులో ఉండి ఆదుకుంటానన్నారు. పొదిలిలోనే నివాసం ఉంటూ పార్లమెంటు పరిధిలోని ప్రజలకు సేవకునిగా ఉంటానన్నారు. రాష్ట్రానికి అభివృద్ధిని పరిచయం చేసిన వైఎస్ కుటుంబంతో 36 ఏళ్లుగా ఉంటున్నానన్నారు. పార్లమెంటు పరిధిలోని సమస్యల పరిష్కారం కోసం తన వంతుగా కృషి చేస్తానన్నారు.ఆదరించాలని కోరారు.

**పొదిలి:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచారం శనివారం పట్టణంలో భారీ ఎత్తున జరిగింది. పార్టీ శ్రేణులు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఏపీని ఉర్రూతలూగిస్తున్న జగన్ పాట వినిపిస్తుండగా కార్యకర్తలు మరింత హుషారుగా లయబద్ధంగా నృత్యాలు చేశారు. మార్కాపురం అడ్డ రోడ్డు సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పెద్ద బస్టాండ్ వరకు సాగింది. అభిమానులు తమ నాయకులకు పూలదండలు వేస్తూ ఘన స్వాగతం పలికారు. ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి మోటారు సైకిల్ డ్రైవ్ చేస్తుండగా ఎమ్మెల్యే అన్నా రాంబాబు వెనుక వైపు నిల్చొని అభివాదం చేస్తూ ర్యాలీలో కొనసాగారు. అనంతరం పెద్ద బస్టాండ్ సెంటర్‌లో సభ నిర్వహించారు.

**కోర్టులను ఆశ్రయించి అభాసుపాలయ్యారు: జంకె వెంకటరెడ్డి**

సహజంగా కొనసాగుతున్న పథకాలకు ఎన్నికల కోడ్ అడ్డంకి కాదని, కానీ వాటిని ఆపటానికి చంద్రబాబు హైకోర్టుకు వెళ్లారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి అన్నారు. తొలుత వలంటీర్లు పింఛన్ పంచేందుకు వీల్లేదని ఉత్తర్వులు తెప్పించారని, వృద్ధులు, మహిళలు ఎర్రటి ఎండలో ఎన్నో కష్టాలు పడేలా చంద్రబాబు వ్యవహ రించారని చెప్పారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే ఒక్క సంక్షేమ పథకం అమలు చేయరన్నారు.

**అభివృద్ధి కోసం మద్దతు ఇవ్వాలి: అన్నా రాంబాబు**

రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ పాలన ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉందని, మరింత అభివృద్ధి- సంక్షేమం కోసం మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు కోరారు. జగనన్న పాలన మెచ్చి ఇతర పార్టీల నుంచి మన పార్టీలోకి అధిక సంఖ్యలో చేరికలు జరిగాయన్నారు. కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి నీతి నిజాయితీలకు మద్దతు ఇవ్వాలన్నారు. జగనన్న ప్రచారం ముందు కూటమి నాయకుల ప్రచారం తేలిపోయిందన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి, వేయించి అధిక మెజారిటీ సాధించేలా చేయాలని కోరారు. ఏపీఆర్ గ్రూపు సంస్థల చైర్మన్ ఆవుల కృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కేవీ రమణారెడ్డి, జిల్లా కార్యదర్శులు జి.చెన్నారెడ్డి, జి.శ్రీనివాసులు, శ్రావణి వెంకటేశ్వర్లు, పట్టణ కన్వీనర్ నూర్జహాన్‌బేగం, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యక్కలి శేషగిరి రావు, మాజీ జెడ్పీటీసీ సాయి రాజేశ్వరరావు, తాతా సత్యనారాయణ, శింగారెడ్డి వెంకటేశ్వర రెడ్డి, ఆవుల సంజీవరెడ్డి, పోతవరం ఏసేబు, తూము బాలిరెడ్డి, రబ్బానీ బాషా, వర్షం ఫిరోజ్, నాయబ్ రసూల్, మస్తాన్‌వలి, గౌసియా బేగం, కొత్తూరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రాల వారీగా మూడో విడత ర్యాండమైజేషన్



పోలింగ్ బూత్‌ల వారీగా ర్యాండమైజేషన్ నిర్వహిస్తున్న కలెక్టర్, ఎన్నికల పరిశీలకులు

**ఒంగోలు అర్బన్:** పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించేందుకు ఇప్పటికే పీవోలు, ఏపీవోలు, ఓపీవోలతో బృందాలు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం ప్రకాశం భవనంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ పోలింగ్ కేంద్రాల వారీగా ఈ బృందాలను కేటాయించేందుకు మూడో విడత ర్యాండమైజేషన్ నిర్వహించారు. దీని ప్రకారం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ సామగ్రి అందజేసి, ఆయా పోలింగ్ కేంద్రాలకు పంపుతారు. దీనిలో ఎన్నికల సాధారణ పరిశీలకులు అరవింద్ కుమార్ చౌరాసియా, మయూర్ కే మెహతా, డీఆర్‌ఓ శ్రీలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యులపై ఆగని దాడులు

- బియ్యం దుకాణం మళ్లీ సీజ్
- వ్యాపారికి బీపీ తగ్గడంతో కుటుంబసభ్యుల్లో తీవ్ర ఆందోళన
- పరామర్శించిన వ్యాపారవర్గాలు
- బెంబేలెత్తుతున్న స్థానిక వ్యాపారులు
- దామచర్ల కుట్రపై వ్యాపారుల మండిపాటు

**ఒంగోలు:** వ్యాపార వర్గాలు వైఎస్సార్ సీపీకి అండగా ఉన్నారనే అక్కసుతో టీడీపీ నేతలు ఫిర్యాదు చేసి దాడులు చేయించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. నగరంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వీధిలో ఎన్నో ఏళ్లుగా తాతా కోటేశ్వరరావు కుటుంబసభ్యులు బియ్యం వ్యాపారం చేస్తున్నారు. ఈ దుకాణంలో నాణ్యమైన బియ్యం అందుతాయని ఎంతో నమ్మకం. అయితే సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు వచ్చిందంటూ ప్రసన్న అనే అధికారి శుక్రవారం హడావుడి చేసి షాపును సీజ్ చేశారు. విషయం తెలుసుకున్న ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకొని షాపును ఎందుకు సీజ్ చేశారని ప్రశ్నించారు. ఎవరో ఫిర్యాదు చేస్తే విచారణ చేయకుండా సీజ్ చేయడం ఏంటని అడిగారు. అయితే సదరు అధికారి సమాధానం చెప్పకపోవడంతో నిరసనకు దిగారు. దీంతో అక్కడకు చేరుకున్న సబ్ కలెక్టర్ పరిస్థితి సమీక్షించి దుకాణాన్ని మళ్లీ తీయించారు. కానీ శనివారం మళ్లీ రోడ్డుకు ఇరువైపులా 50 మంది చొప్పున పోలీసులను కాపలాగా ఉంచి అధికారులు షాపు వద్దకు చేరుకున్నారు. షాపు మూసివేసి ఉన్నా పై ఇంట్లో ఉన్న వ్యాపారిని పిలిపించి సీజ్‌చేస్తున్నట్లు ప్రకటించారు. ఎందుకు ఏమిటన్నా సమాధానం చెప్పకుండా సీజ్ చేయడంతో వ్యాపారి ఆందోళనకు గురయ్యారు. 120 ఏళ్లుగా నమ్మకంగా వ్యాపారం చేసుకున్న తమ షాపుపై మచ్చ వేయడం సరికాదని వేడుకున్నా ససేమిరా అన్నారు. చివరకు ఆయన బీపీ తగ్గడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.

**ఆర్యవైశ్యుల పరామర్శ**

విషయం తెలుసుకున్న ఆర్యవైశ్యులు షాపు వద్దకు చేరుకున్నారు. షాపు యజమాని సుధాకర్‌ను పరామర్శించారు. అధైర్యపడవద్దని, ధైర్యంగా ఉండాలని సూచించారు. తామంతా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ ఒంగోలులో ఆర్యవైశ్యులు వైఎస్సార్ సీపీపై కనబరుస్తున్న విశ్వాసాన్ని జీర్ణించుకోలేక దామచర్ల జనార్దన్ అక్కసుతో దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. వ్యాపారులంటే ఏదో పాకిస్తాన్ వాదుల్లాగా, ఉగ్రవాదుల్లాగా భావిస్తూ భయాందోళనలు సృష్టించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గతంలో పత్తి రామకృష్ణను ఇదే విధంగా వేధించడంతో అతను తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన విషయాన్ని గుర్తు చేశారు. ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉండి దామచర్ల జనార్దన్‌ను తరిమితరిమి కొట్టేలా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సింగరాజు మీనాకుమారి మాట్లాడుతూ దామచర్ల ఆర్యవైశ్యులపై అక్కసు పెంచుకొని ఫిర్యాదులు చేయించి అక్రమంగా దుకాణాలను సీజ్ చేయడాన్ని ఖండించారు. ఆర్యవైశ్యుల వ్యాపారాలపై బెంబేలెత్తించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఆర్యవైశ్యులంతా ఐక్యంగా ఓటు అనే ఆయుధంతో దామచర్ల జనార్దన్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం నగర అధ్యక్షుడు కూరపాటి రమేష్, శ్రీబాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ చైర్మన్ కోడూరి సత్యన్నారాయణ, కారంశెట్టి కిరణ్‌కుమార్, గణేష్, వంశీ, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్


సీజ్ చేసిన దుకాణం

# ప్రచారానికి తెర

- ముగిసిన సార్వత్రిక ఎన్నికల ప్రచారం
- మూతపడిన మద్యం షాపులు
- నేటి ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సామగ్రి
- రేపు ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్

**ఒంగోలు అర్బన్:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రేపు ప్రధాన ఘట్టమైన పోలింగ్ జరగనుంది. ఎన్నికల నిబంధనల మేరకు రాజకీయ పార్టీల ప్రచారాలు శనివారం సాయంత్రంతో ముగిశాయి. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంట్ నియోజకవర్గంలో రేపు జరిగే పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా యంత్రాంగం అన్నీ చర్యలు తీసుకుంది. ఎన్నికల నిబంధనల మేరకు 48 గంటల పాటు మద్యం దుకాణాలు మూసివేశారు. అంతేకాకుండా రాజకీయ పార్టీల ప్రచారానికి వచ్చిన ఇతర జిల్లాల వారిని తిరిగి వారి జిల్లాలకు పంపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం లేకుండా తాగునీరు, షామియానాలు, టాయిలెట్లు తదితర సౌకర్యాలను సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో వాహనాలు నిలిపేలా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా 200 మీటర్ల అవతల రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం నిర్దేశించిన సైజులో షామియానా ఏర్పాటు చేసుకుని ఓటర్లకు అవసరమైన స్లిప్‌లు ఇవ్వవచ్చు.

అయితే ప్రచారం నిర్వహించకూడదు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా చర్యలతో పాటు ఎవరైనా గొడవలు చేస్తే వారిపై కఠిన చర్యలకు యంత్రాంగం సిద్ధమైంది. నేటి ఉదయం నుంచి నియోజకవర్గాల వారీగా పోలింగ్ సిబ్బందికి ఆయా నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ద్వారా పోలింగ్ సామగ్రిని అందజేసి పోలింగ్ కేంద్రాలకు తరలిస్తున్నారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది రవాణాకు ఇబ్బంది లేకుండా నియోజకవర్గాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులను సైతం సిద్ధం చేశారు. ఎన్నికలు జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఆదేశాలు, నిబంధనల మేరకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆధ్వర్యంలో అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసి అధికారులు, సిబ్బందితో సర్వం సిద్ధంగా ఉన్నారు.